తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 21- ఏప్రిల్ 2026 | సంపుటి : 3 | సంచిక : 323 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# రైతు భరోసా నిధుల విడుదల



## 40 లక్షల రైతుల ఖాతాల్లో రూ.2,200 కోట్లు జమ

## నస్తూర్‌పల్లిలో రైతు ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం

## ఇప్పటివరకు రూ.5,700 కోట్లు – వచ్చే నెలలో మరింత నిధులు

## రైతు సంక్షేమమే ప్రభుత్వ విధానం అని సీఎం స్పష్టం

**జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** రైతుల ఆర్థిక భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 40 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నస్తూర్‌పల్లి గ్రామంలో నిర్వహించిన రైతు ఉత్సవాల్లో పాల్గొని కంప్యూటర్‌పై బటన్ నొక్కి రూ.2,200 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు.

మిగతా 2లో





## మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణపై సీఎం సమీక్ష

- కుంగిన ప్రాంతం ప్రత్యక్ష పరిశీలన
- జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షల పరిశీలన
- నిపుణుల సూచనలతో పునరుద్ధరణకు దిశానిర్దేశం
- సీఎం రేవంత్ రెడ్డి

**జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణకు సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక చర్యలు చేపట్టారు. కుంగిపోయిన బ్యారేజీ ప్రాంతాన్ని స్వయంగా సందర్శించి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. మంత్రులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి సైట్‌ను పరిశీలిస్తూ పునరుద్ధరణకు చేపడుతున్న పరీక్షలను వివరంగా తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షల ప్రక్రియను ముఖ్యమంత్రి సమగ్రంగా పరిశీలించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు చేపడుతున్న ఈ పరీక్షలు బ్యారేజీ పరిస్థితిని అంచనా వేయడంలో కీలకమని అధికారులు తెలిపారు.

మిగతా 2లో

### వాతావరణ ప్రభావంతో

## నీటి పంపింగ్‌కు అంతరాయం

- సింగూర్–మంజీరా కేంద్రాల్లో సమస్యలు
- విద్యుత్ అంతరాయంతో సరఫరా దెబ్బతింతోంది
- జలమండలి అప్రమత్తంగా చర్యలు

2లో





## పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి జూపల్లి సమీక్ష

- హిమాయత్‌నగర్‌లో టీజీటీడీసీ కార్యాలయంలో సమావేశం
- పర్యాటక, పురావస్తు, బుద్ధవనం ప్రాజెక్టులపై చర్చ
- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచనలు

**హైదరాబాద్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హిమాయత్‌నగర్‌లోని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ కార్యాలయంలో పర్యాటక రంగానికి సంబంధించిన ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పర్యాటక, పురావస్తు శాఖలతో పాటు బుద్ధవనం ప్రాజెక్ట్ అధికారులతో విస్తృతంగా చర్చించారు. ష్ట్రంలో కొనసాగుతున్న పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. వివిధ ప్రాజెక్టుల అమలు స్థితి, ఎదురవుతున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై

మిగతా 2లో

## హరీశ్ రావుపై తుమ్మల తీవ్ర విమర్శలు

### బీఆర్ఎస్ పాలనపై మంత్రి ఆరోపణలు

### ప్రాజెక్టుల అమలులో లోపాలపై వ్యాఖ్యలు

### గోదావరి జలాల తరలింపుపై వివరణ



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ అగ్రనేత తన్నీరు హరీశ్ రావుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర విమర్శలు చేశారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు వ్యవస్థలను దోచుకుని రాష్ట్రాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. హరీశ్ రావు రాజకీయ భవిష్యత్తు అంధకారంలో ఉందని, అందుకే అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. హరీశ్ రావు ప్రస్తుతం మానసిక వేదనలో ఉన్నారని

మిగతా 2లో

# హైడ్రా రద్దు చేస్తాం: కేసీఆర్

## మాటలు కాదు, పనులు చేశాం



- కాంగ్రెస్‌పై తీవ్ర దాడి, 'హైడ్రా'పై హెచ్చరికలు
- వ్యక్తిగత విమర్శలకు స్ట్రాంగ్ కౌంటర్
- హామీలు అమలు కాలేదంటూ ప్రభుత్వంపై విమర్శలు
- 'హైడ్రా' నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం
- జగిత్యాలలో కేసీఆర్ ఘాటు ప్రసంగం

**జగిత్యాల, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి పెరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులు తనపై చేస్తున్న విమర్శలకు బీఆర్ఎస్ అధినేత కే. చంద్రశేఖర్ రావు జగిత్యాలలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఘాటుగా స్పందించారు. వ్యక్తిగత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఆయన, ప్రజల ఆశీర్వాదం ఉన్నంతవరకు తాను నిలబడతానని స్పష్టం చేశారు.

సభలో మాట్లాడుతూ కేసీఆర్ తనపై జరుగుతున్న విమర్శలను ఖండిస్తూ, "ఎవరైనా కోరుకున్నంత మాత్రాన నేను చావను" అని వ్యాఖ్యానించారు. తనపై ప్రతిరోజూ దూషణలు జరుగుతున్నాయని, కానీ ప్రజల మద్దతు తనకు అండగా ఉందని అన్నారు. రాజకీయంగా తాను మరింత బలంగా నిలబడతానని ధీమా వ్యక్తం చేశారు.

తమ పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా కేసీఆర్ విపులంగా వివరించారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించి భూగర్భ జలాలు పెంచామని, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించామని గుర్తు చేశారు. "మాటలు కాదు, పనులు చేశాం" అంటూ తమ పాలనను సమర్థించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యను పూర్తిగా పరిష్కరించామని పేర్కొన్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మహిళలకు ఆర్థిక సాయం, యువతకు ఉపాధి, రైతులకు మద్దతు వంటి అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. "ఆరు గ్యారంటీలు, ఎన్నో హామీలు ఇచ్చినా ఒక్కటీ పూర్తి కాలేదు" అని విమర్శించారు.

ఇక 'హైడ్రా' అంశంపై కేసీఆర్ తీవ్రంగా స్పందించారు. అధికారంలోకి వస్తే 'హైడ్రా'ను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఇళ్లను కూల్చివేయడం, పేదలను ఇబ్బందులకు గురిచేయడం అభివృద్ధి కాదని అన్నారు. "ప్రభుత్వం ప్రజల కోసం ఉండాలి కానీ ప్రజలను భయపెట్టే విధంగా ఉండకూడదు" అని వ్యాఖ్యానించారు. మొదటి రోజే హైడ్రాను తొలగిస్తామని హామీ ఇచ్చారు.

మిగతా 2లో

## మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఘన సన్మానం

- రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అభినందనలు
- డిజిటల్ హెల్త్ కార్డుల నిర్ణయానికి స్వాగతం
- సంగారెడ్డిలో పైలెట్ ప్రాజెక్ట్ అమలు



**సంగారెడ్డి, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను జోగిపేట కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు మంజూరు చేసినందుకు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. డిజిటల్ హెల్త్ కార్డుల ద్వారా వైద్య సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరోగ్య భద్రతకు ఇది కీలకమైన చర్యగా అభివర్ణించారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డిజిటల్ హెల్త్ కార్డుల పంపిణీ ద్వారా వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# రైతు భరోసా నిధుల విడుదల

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇప్పటివరకు రైతు భరోసా కింద మొత్తం రూ.5,700 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. వచ్చే నెలలో మరో రూ.3,300 కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

రైతులతో కలిసి గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో సీఎం పాల్గొని వారితో ప్రత్యక్షంగా ముచ్చటించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ "ఈ దేశానికి వెన్నెముక రైతులే" అని పేర్కొన్నారు. రైతులను ఆదుకోవడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, వారి సంక్షేమం కోసం అన్ని విధాలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

రుణమాఫీపై కూడా సీఎం వివరాలు వెల్లడించారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు 25.35 లక్షల మంది రైతులకు ఇప్పటికే రుణమాఫీ చేసినట్లు తెలిపారు. వ్యవసాయం పండుగలా మారాలని, రైతుల కళ్లల్లో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తూ రైతులకు మరింత మేలు చేయాలని ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వివేక్ వెంకటస్వామి తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతకుముందు సీఎం రూ.203 కోట్ల వ్యయంతో ఆరెంద-దామెరకుంట గ్రామాల మధ్య మానేరు నదిపై నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రాంతీయ రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

మొత్తంగా రైతు భరోసా నిధుల విడుదలతో రాష్ట్రంలో రైతులకు పెద్ద ఎత్తున ఆర్థిక ఉపశమనం లభించనుంది. ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీఎం తెలిపారు.

# జీవన్ రెడ్డిపై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు

- కేసీఆర్‌కు సవాల్
- రైతు ఉత్సవాల వేదికగా రాజకీయ దాడి
- పార్టీ మార్పుపై జీవన్ రెడ్డిని నిలదీశారు
- 2029లో తేల్చుకుందాం అంటూ కేసీఆర్‌కు సవాల్

**జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన రైతు ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. నస్తూర్‌పల్లి గ్రామంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ జీవన్ రెడ్డి రాజకీయ చరిత్ర, ఆయనపై ఉన్న ఆరోపణలు తనకు తెలుసని పేర్కొన్నారు. సభ వేదిక నుంచి రైతు భరోసా రెండో విడత నిధులను విడుదల చేసిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ "ప్రజాపాలన పోవాలి, పాపాల భైరవుడు అధికారంలోకి రావాలి" అని కొందరు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఫామ్ హౌస్‌లో ఉండే వ్యక్తి మళ్లీ ఎందుకు అధికారంలోకి రావాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి అధికారంలోకి తీసుకువచ్చిన ప్రభుత్వాన్ని కూల్చాలనే పిలుపు ఎందుకు ఇస్తున్నారో జీవన్ రెడ్డి స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

జీవన్ రెడ్డి పార్టీ మార్పుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో ఉండి అనేక పదవులు పొందిన తర్వాత ఇప్పుడు పార్టీని వదిలి పెట్టడం ద్రోహమని అన్నారు. 14 సార్లు టికెట్ ఇచ్చినా, ఓడిపోయినప్పటికీ గౌరవం ఇచ్చినా, ఇప్పుడు కార్యకర్తల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు.

ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న వారిని కూడా సీఎం నిలదీశారు. ఒక వ్యక్తికి పదవి రాకపోతే ప్రభుత్వం పోవాలా అని ప్రశ్నించారు. గత పాలనలో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ ఇసుక లారీ ఘటనలు, సచివాలయం కూల్చివేత, కుటుంబ పాలన వంటి అంశాలపై తీవ్రంగా విమర్శించారు. పేదలకు ఉపయోగపడని కార్యక్రమాలు చేపట్టారని ఆరోపించారు. అదేవిధంగా బీఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ రావుపై కూడా సీఎం ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ప్రతిపక్ష హోదా కూడా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటాను" అంటూ సవాల్ విసిరారు. 2029 ఎన్నికల్లో తేల్చుకుందామని ప్రకటించారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. పేదలకు సన్న బియ్యం అందించాలనే ఆలోచన గతంలో ఎవరికీ రాలేదని వ్యాఖ్యానించారు. రైతు సంక్షేమం, పేదల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మొత్తంగా ఈ సభలో సీఎం చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారి తీశాయి. కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య వాగ్వాదం మరింత ముదురే సూచనలు కనిపిస్తున్నాయి.



# మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణపై సీఎం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి పరీక్ష విధానాన్ని ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ సీఎం అధికారులను ప్రశ్నలు అడిగి వివరాలు సేకరించారు. ముఖ్యంగా పియర్స్ 20, 21, 22 ప్రాంతాల్లో బోర్ రిగ్స్ ద్వారా నమూనాలు సేకరించే ప్రక్రియను సీఎం పరిశీలించారు. మొత్తం 520 బోర్ రిగ్స్ ద్వారా సేకరించే శాంపిల్స్‌ను కేంద్ర జల పరిశోధన సంస్థకు పంపించి ల్యాబ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షల అనంతరం బ్యారేజీ లోపాలపై పూర్తి అవగాహన లభించనుంది. డ్రోన్ ఆధారిత జీపీఆర్ పరీక్షలపై కూడా అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. 20 నుంచి 30 మీటర్ల లోతు వరకు నేల స్వభావాన్ని అంచనా వేయడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయని అధికారులు వివరించారు. సీకెంట్ పైల్స్‌కు సంబంధించిన క్రాస్‌హోల్ సీస్మిక్ పరీక్షలపై కూడా సీఎం సమగ్రంగా అవగాహన పొందారు.

సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ సమస్యను పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. నిపుణుల సూచనలు, పరీక్షల ఫలితాల ఆధారంగా మాత్రమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, ప్రతి దశలో అనుమతులు తీసుకుని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్, కేంద్ర సంస్థల ప్రతినిధులు, నిర్మాణ సంస్థల నిపుణులు, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

మొత్తంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల లోపాలను సరిచేసి కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ చర్యలు పూర్తయ్యాక ప్రాజెక్టు మళ్లీ పూర్తి సామర్థ్యంతో పనిచేసే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.

# హరీశ్ రావుపై తుమ్మల తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

తుమ్మల వ్యాఖ్యానించారు. గతంలో ఎదురైన పరిణామాలు, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల ప్రభావంతో ఆయన ఇలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎక్కడికి వెళ్లినా ఒకే విషయాలను పునరావృతం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

సీతారామ సాగర్ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే హక్కు లేదని తుమ్మల స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు తన రాజకీయ లక్ష్యమని, దీనిని పూర్తి చేయడమే తన జీవిత ధ్యేయమని తెలిపారు. గత ప్రభుత్వం సరైన అనుమతులు లేకుండా భారీగా ఖర్చు చేసి లోపభూయిష్టమైన పనులు చేపట్టిందని ఆరోపించారు. గత పాలనలో కేవలం కమీషన్ల కోసం ప్రాజెక్టుల డిజైన్లలో లోపాలు ఉంచారని తుమ్మల విమర్శించారు. హెడ్ వర్క్స్ లిఫ్ట్ కూడా పూర్తి చేయలేని పరిస్థితిలో పనులు కొనసాగించారని అన్నారు. ఈ కారణంగా ప్రాజెక్టుల ప్రయోజనాలు ప్రజలకు అందలేదని పేర్కొన్నారు.

ప్రస్తుత ప్రభుత్వం గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తరలించేందుకు వంద కోట్ల రూపాయలు వెచ్చించిందని మంత్రి వివరించారు. సత్తుపల్లి టన్నెల్ నిర్మాణానికి మరో 1,500 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చర్యల ద్వారా నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తుమ్మల పేర్కొన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌ను అధికారానికి దూరం చేసినా వారి నేతల్లో అహంకారం తగ్గలేదని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

# పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి జూపల్లి సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)




సమగ్రంగా సమీక్ష జరిగింది. ముఖ్యంగా బుద్ధవనం ప్రాజెక్ట్ అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా చర్చించినట్లు సమాచారం.

పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రణాళికలు రూపొందించాలని మంత్రి జూపల్లి సూచించారు. పర్యాటక ప్రదేశాల అభివృద్ధి ద్వారా రాష్ట్రానికి ఆదాయం పెరగడమే కాకుండా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేసి, సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగంలో తెలంగాణను ముందంజలో నిలపడానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## వాతావరణ ప్రభావంతో
# నీటి పంపింగ్‌కు అంతరాయం

**హైదరాబాద్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ నగరానికి తాగునీటిని సరఫరా చేసే సింగూర్, మంజీరా పంప్ హౌస్ ప్రాంతాల్లో ఇటీవలి వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. గాలి దుమారం, వడగండ్ల వానలు, అకాల వర్షాల కారణంగా చెట్లు విరిగి పడటం, విద్యుత్ తీగలు తెగిపోవడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితులు నీటి సరఫరా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరాలో తరచుగా వచ్చే అంతరాయాల కారణంగా నీటి పంపింగ్ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోతోంది. ఫలితంగా నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఆలస్యమవడం లేదా అంతరాయం కలగడం జరుగుతోంది. చిన్న వ్యవధిలో జరిగే విద్యుత్ అంతరాయాలు కూడా మంజీరా వ్యవస్థ పనితీరును గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.



ఆదివారం జరిగిన విద్యుత్ అంతరాయం కారణంగా సుమారు ఏడు గంటలపాటు పంపింగ్ నిలిచిపోవడంతో షెడ్యూల్ ప్రకారం జరిగే పనులు దెబ్బతిన్నాయి. దీనివల్ల నీటి ప్రెషర్‌లో మార్పులు, సరఫరా ఆలస్యం వంటి సమస్యలు ఏర్పడ్డాయి. పాత మంజీరా నీటి సరఫరా వ్యవస్థ ఈ పరిస్థితులకు ఎక్కువగా ప్రభావితమవుతోందని తెలిపారు. ఈ ప్రభావం నగరంలోని ఆర్‌సి పురం, బీహెచ్‌ఈఎల్, చందానగర్, మియాపూర్, కూకట్‌పల్లి, ఎర్రగడ్డ, ఎస్‌ఆర్ నగర్, సనత్‌నగర్ ప్రాంతాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా షెడ్యూల్లు మారడం, తక్కువ ఒత్తిడితో నీరు రావడం, కొన్నిసార్లు తాత్కాలిక కొరత వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. జలమండలి అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రభావిత ప్రాంతాలకు నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే మరమ్మతులు చేపడుతూ, విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన వెంటనే పంపింగ్ ప్రారంభిస్తున్నారు. అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జలమండలి అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సహజ పరిస్థితుల వల్ల కొంత ఇబ్బంది తలెత్తడం సహజమని, ప్రజలు సహకరించాలని కోరారు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు సహనంతో వ్యవహరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



# మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఘన సన్మానం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా రిటైర్డ్ ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జోగిపేట అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మనోహర్ ప్రసాద్, నవీన్ కుమార్, వీరేశం, సదాశివ గౌడ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సాదర వాతావరణంలో జరిగింది.

మొత్తంగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కల్పించడంలో కీలకంగా నిలుస్తుందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు.

# హైడ్రా రద్దు చేస్తాం: కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)


మూసీ అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి అంటే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, కానీ ప్రజలను రోడ్లపైకి తెచ్చే విధంగా కాకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని అన్నారు.

వ్యవసాయ రంగంపై కూడా కేసీఆర్ మాట్లాడారు. తమ పాలనలో రైతులకు ఉచిత విద్యుత్ అందించామని, మీటర్లు పెట్టడాన్ని వ్యతిరేకించామని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులపై మళ్లీ భారం పడే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. రైతుల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ పునర్నిర్మాణం కోసం మళ్లీ ఉద్యమం అవసరమని కేసీఆర్ పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలు ఏకమై తమ హక్కుల కోసం నిలబడాలని సూచించారు. "చివరి శ్వాస వరకు తెలంగాణకు సేవ చేస్తాను" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ సభతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చలు వేగం పుంజుకున్నాయి.



# వాతావరణం, సాంకేతిక సమస్యలతో విమానాల దారి మళ్లింపు

- హైదరాబాద్–హుబ్లీ విమానం బెంగళూరుకు మళ్లింపు
- గాల్లో గంటల తరబడి చక్కర్లు – ప్రయాణికుల్లో భయం
- మరో విమానం గోవాకు మళ్లింపు



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ నుంచి హుబ్లీ వెళ్తున్న ఫ్లై91 విమానాన్ని వాతావరణం అనుకూలించకపోవడంతో బెంగళూరుకు దారి మళ్లించారు. గాల్లో ప్రయాణిస్తున్న సమయంలో సాంకేతిక సమస్య తలెత్తినట్టు అధికారులు వెల్లడించారు. పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విమానాన్ని మళ్లించడం తప్పనిసరి అయిందని తెలిపారు. అయితే విమానంలోని ప్రయాణికులంతా సురక్షితంగానే ఉన్నారని స్పష్టం చేశారు. ఆదివారం జరిగిన ఈ ఘటనలో విమానం సుమారు మూడు గంటలపాటు గాల్లోనే చక్కర్లు కొట్టింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కొందరు భయంతో ఏడుస్తూ క్షేమంగా దిగాలని ప్రార్థనలు చేసినట్లు సమాచారం. సాయంత్రం 3.30 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఈ విమానం, సాధారణంగా 4.30 గంటలకు హుబ్లీ చేరుకోవాల్సి ఉంది. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో బెంగళూరుకు మళ్లించాల్సి వచ్చింది.

తర్వాత సాయంత్రం 6.30 గంటలకు బెంగళూరు నుంచి మళ్లీ బయలుదేరిన విమానం, రాత్రి 11 గంటల సమయంలో హుబ్లీకి చేరుకుంది. మొత్తం 22 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించిన తర్వాతే విమానాన్ని మళ్లీ ప్రయాణానికి అనుమతించినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా వాతావరణ పరిస్థితుల ప్రభావంతో మరో విమానాన్ని కూడా దారి మళ్లించారు. ముంబై నుంచి కొల్హాపూర్ వెళ్లాల్సిన విమానాన్ని గోవాకు మళ్లించారు. ఈ విమానంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు లేవని, ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని సంబంధిత అధికారులు వెల్లడించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
మంగళవారం - 21- ఏప్రిల్ 2026
వరంగల్




## బోటి గుట్టపై మల్లన్న జాతర జోష్

- **భోనాలు, పట్నాలతో సిర్సపల్లి ఉత్సాహం**

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మండలం సిర్సపల్లిలోని బోటి గుట్ట వద్ద వెలసిన స్వయంభు ఐలోని మల్లన్న స్వామి ఆలయంలో ఆదివారం భోనాలు, పట్నాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. జాతర సందర్భంగా పరిసర గ్రామాలైన రంగాపూర్, రాంపూర్‌కు చెందిన మహిళలు సంప్రదాయ దుస్తుల్లో తలపై భోనాలు ఎత్తుకొని గ్రామ వీధుల గుండా ఊరేగిస్తూ భక్తి పరవశంతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఒగ్గు కళాకారులు ఒగ్గు కథలను వినిపిస్తూ, ఒగ్గు డోలు మోగిస్తూ మల్లన్న స్వామి మహిమను గాన రూపంలో వినిపించారు. కోలాటం ప్రదర్శనలు, జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు సంప్రదాయం ప్రకారం మొక్కులు చెల్లించుకుంటూ, స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. మొత్తం మీద సిర్సపల్లిలో మల్లన్న జాతర భక్తి, సంప్రదాయం, సంస్కృతి కలబోతగా వైభవంగా కొనసాగింది.




## హుజురాబాద్ మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

- **రైతులకు మద్దతు ధర హామీ**

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మార్కెట్ యార్డులో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, రైతులు పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా అధికారులు, వ్యాపారులు వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారులకు కృతజ్ఞతలు

- **తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (రిజిస్టర్డ్) సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కే.వీ. కృష్ణారావు**

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 20(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (రిజిస్టర్డ్) సంఘం పిలుపుమేరకు ఖమ్మం జిల్లా నుండి వెళ్లి సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఉద్యమకారునికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలను తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కే.వీ.కృష్ణారావు , ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య తెలిపారు .

**కల్వకుంట్ల కవిత కు ప్రత్యేక కృతజ్ఞతలు**

సెక్రటేరియట్ ముట్టడికి వెళ్లిన తెలంగాణ ఉద్యమకారును హైదరాబాదులో పోలీసులు అరెస్టు చేసి మెహిదీపట్నం పోలీస్ స్టేషన్ లో ఉంచారని తెలుసుకొని పరామర్శించడనికి వచ్చిన శ్రీమతి కల్వకుంట్ల కవిత కు తెలంగాణ ఉద్యమకారుల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కే.వీ. కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు . లేని పక్షంలో ప్రజా ప్రతినిధులను అడుగు అడుగున నిలదీయావలసి వస్తుందని హెచ్చరించారు . ముందు ముందు ఇలాగే ఉద్యమకారులు సహకరించాలని కోరారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు బచ్చల పద్మాచారి , నెలవెల్లి వెంకటేశ్వరావు , భుక్య శ్రీనివాస్ నాయక్ , గొట్టిపర్తి శ్రీనివాస్ , మల్లెబోయిన వెంకయ్య , బొమ్మ పరశు రామ్ తదితరులు పాల్గొన్నారు .

# డాక్టర్ పులిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

- **దేశంలోనే ఏకైక విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు**
- **డాక్టర్ పులిపాటి ప్రసాద్**

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 20(తెలంగాణ ముచ్చట్లు )**



ఖమ్మం పౌరసమితి అధ్యక్షులు డాక్టర్ పులిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పులిపాటి ప్రసాద్ రాష్ట్ర తెలుగు యువత విద్యార్థులు కేకు కట్ చేసి నారా చంద్రబాబు నాయుడు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఏకైక విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. దార్శనికత ఐటీ రంగ విస్తరణ ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన సమర్థవంతమైన పరిపాలనకు ప్రసిద్ధి చంద్రబాబుకే సాధ్యం అన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో హైటెక్ సిటీ స్థాపనతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ మ్యాప్‌లో నిలిపి వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. 2026 నాటికి 22 నెలల్లోనే రూ. 9.36 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, అమరావతిని అభివృద్ధి చేస్తున్న విజనరీ నేతగా నిలిచారని అన్నారు. 1990లలోనే ఐటీ రంగాన్ని గుర్తించి హైదరాబాద్‌ను ప్రపంచ ఐటీ హబ్‌గా మార్చారు.హైటెక్ పరిపాలన ఇగవర్నెన్స్ రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పారదర్శకమైన వేగవంతమైన పరిపాలన అందించారని తెలిపారు. ఈ కార్యక్రమం నందు ఖమ్మం జిల్లాకు చెందిన యువతరం నటులు నటించిన కడదాక నీవెంటే చిత్రం రష్యానందు జరిగిన స్పేస్ ఫెస్టివల్ నందు బెస్ట్ ఫీచర్ ఫిల్ముగా ఎంపికైన సందర్భంగా చిత్ర బృందాన్ని డాక్టర్ పులిపాటి ప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలు హాస్పిటల్ నందు రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. అనాధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం రైల్వే స్టేషన్ నందు గల వృద్ధులకు వస్త్ర దానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం పౌర సమితి అధ్యక్షులు డాక్టర్ పులిపాటి ప్రసాద్ తెలుగు యువత రాష్ట్ర నాయకులు నాగళ్ళ శ్రీనివాస్ చౌదరి కడదాక నీ వెంటే చిత్రబృందం హీరో దర్శకుడు కిషోర్ ఇనుపనూరి అనిల్ మద్దెల భోగరాజు శోభన్ బాబు పులిపాటి ప్రసాద్ విద్యాసంస్థల అధ్యాపక బృందం ప్రతాప్ శ్వేత శ్రీనివాస్ నీరజ అక్ష అఖిల్ సాయిశ్రీ శిరీష సునీత మౌనిక మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు అందించిన సహకారం మరువలేనిది : పులిపాటి ప్రసాద్**

టిఎన్ఎస్ యూ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడిగా రెండేళ్లు చంద్రబాబు నాయుడు దగ్గర పని చేశానని రాజకీయంగా నాకు ఆవకాశం కల్పించిన ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడులకు ఎంతో రుణపడి ఉంటానని ఈ సందర్భంగా డాక్టర్ పులి ప్రసాద్ తెలిపారు.

# కబ్జా స్థలంలో మీటింగ్ పెట్టి మాకు నీతులు చెబుతున్నారా?

- **హరీష్ రావు పై మంత్రి తుమ్మల గరం**

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 20(తెలంగాణ ముచ్చట్లు )**



స్థలంలో మీటింగ్ పెట్టి మాకు నీతులు చెబుతున్నారా అంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. సోమవారం ఖమ్మం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆదివారం జన్మదిన వేడుకల్లో.. ఆత్మీయ సమ్మేళనమే నాకు తెలియదు కానీ, హరీష్ రావు మాట్లాడే తీరును చూస్తే ఆయన మానసిక స్థితి సరిగా లేదని అర్థమవుతుందని అన్నారు. పదేళ్ల పాలనలో మీరు ఆర్థిక విధ్వంసం సృష్టించి ఈరోజు మాకు నీతులు చెబుతున్నారా అంటూ మంత్రి తుమ్మల హరీష్‌రావు పై ఫైర్ అయ్యారు.

మీ హయాంలో రైతు బంధు, సీఎం రిలీఫ్ ఫండ్ స్కాం లు జరగలేదా అంటూ ప్రశ్నించారు. భూ కబ్జాలు, ప్రజల పై కేసులు పెట్టించి నానా ఇబ్బందులకు గురిచేసింది ఎవరో ప్రజలకు తెలుసు అన్నారు. రుణమాఫీ మొదటి మూడు నెలల్లో రైతులు ఖాతాలో జమ చేసిన ఏకైక ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ అన్నారు.

రూ. 25 వేల కోట్ల రూపాయలను రైతు ఖాతాలో జమ చేశామని, మీకు అనుమానం ఉంటే ఖాతా నెంబర్లు ఇస్తాము వెళ్లి చెక్ చేసుకోండి అన్నారు. పది సంవత్సరాల్లో మీరు సృష్టించిన విధ్వంసాన్ని సరి చేసుకుంటూ కష్టాల్లో ఉన్న కూడా ప్రతి ఒక్క సంక్షేమ పథకం అమలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. పార్టీలో హరీష్ రావు స్థాయి ఏందో ముందు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మాజీ జిల్లా అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై అవగాహన సదస్సు

**పెద్దమందడి,ఏప్రిల్20(తెలంగాణ ముచ్చట్లు):**





వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని 23 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు మరియు పంచాయతీ కార్యదర్శుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 ఫైనల్స్ పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల వినియోగ విధానం, గ్రామపంచాయతీ ఖర్చుల నిర్వహణ పద్ధతులు మరియు డిజిటల్ టోకెన్ వినియోగంపై వివరించారు.మండల పంచాయతీ అధికారి ఇంచార్జి ఎంపీడీవో పుష్ప మాట్లాడుతూ నిధుల వినియోగంలో పారదర్శకత, బాధ్యతాయుతమైన ఖర్చు విధానం పాటించాల్సిన అవసరాన్ని వివరించారు.గ్రామాల అభివృద్ధి కోసం అందరూ సహకరించాలని అన్నారు కార్యక్రమంలో అన్ని 23 గ్రామపంచాయతీలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో దేవాలయ పునరాభివృద్ధికి శ్రీకారం

- **గోదావరి తీరం అభివృద్ధి దిశగా సీఎం కీలక అడుగు**
- **బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల సమగ్ర అభివృద్ధి లక్ష్యం**
- **రూ.198 కోట్లతో విస్తృత పునరుద్ధరణ పనులు ప్రారంభం**
- **యాత్రికులకు సౌకర్యాలు – బస్ స్టేషన్ నిర్మాణానికీ శంకుస్థాపన**
- **సీఎం రేవంత్ రెడ్డి**





**కాళేశ్వరం, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** గోదావరి నదీతీరం వెంట ఉన్న ప్రాచీన, పౌరాణిక ప్రాధాన్యత కలిగిన ఆలయాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఆలయాలను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మహత్తర యోజనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం పునరాభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రాంతీయంగా మాత్రమే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఈ పునరుద్ధరణ పనులు గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. భక్తులకు శాశ్వతంగా మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రూ.198 కోట్ల భారీ వ్యయంతో పనులు చేపట్టడం విశేషం. ఆలయ ప్రాంగణం అభివృద్ధి, రహదారుల విస్తరణ, పార్కింగ్ స్థలాలు, తాగునీటి సదుపాయం, శౌచాలయాలు, యాత్రికుల విశ్రాంతి గృహాలు వంటి మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులు పూర్తయ్యాక కాళేశ్వరం దేవస్థానం ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే కాకుండా ప్రముఖ పర్యాటక కేంద్రముగా మారనుందని అధికారులు తెలిపారు.

భూమిపూజ కార్యక్రమానికి ముందు ముఖ్యమంత్రి స్వయంగా దేవాలయంలోకి వెళ్లి శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించగా, కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు.

ఇదే కార్యక్రమంలో కాళేశ్వరం బస్ స్టేషన్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేయడం జరిగింది. యాత్రికుల రాకపోకలను సులభతరం చేయడం, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, పర్యాటక అభివృద్ధికి ఊతం ఇవ్వడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యాలు. బస్ స్టేషన్ నిర్మాణంతో ప్రాంతీయ కనెక్టివిటీ మరింత మెరుగుపడనుంది. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అలాగే జాతీయ డ్యాం భద్రతా సంస్థ చైర్మన్ అనిల్ జైన్ సహా ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమంలో హాజరయ్యారు.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ గోదావరి తీరం అభివృద్ధి రాష్ట్రానికి ఆధ్యాత్మిక, పర్యాటక రంగాల్లో కొత్త అవకాశాలను తెరుస్తుందని పేర్కొన్నారు. పుష్కరాల సమయానికి లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలతో పనులు చేపడుతున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

మొత్తంగా ఈ పునరాభివృద్ధి ప్రాజెక్ట్ తెలంగాణలో ఆధ్యాత్మిక పర్యాటక రంగానికి కొత్త దిశను చూపనుంది. కాళేశ్వరం ప్రాంతం దేశవ్యాప్తంగా ప్రముఖ తీర్థక్షేత్రంగా ఎదిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలు ప్రాంతీయ అభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెరుగుదలకు దోహదపడతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఉపాధి కూలీల ఆందోళన.!

- మూడు నెలలుగా బిల్లులు రాక ఇబ్బందులు.

**సత్తుపల్లి, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**




తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సత్తుపల్లి రూరల్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం వద్ద గ్రీవెన్స్ డే సందర్భంగా గ్రామీణ ఉపాధి కూలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీబీజీ రాంజీ బిల్లును రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను వెంటనే చెల్లించాలని, రెండుసార్లు ఫోటో సిస్టంను రద్దు చేయాలని, పని ప్రదేశాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, తీవ్ర ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు గత మూడు నెలలుగా బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్త పథకాలు ప్రవేశపెట్టి కూలీలకు పనులు తగ్గిస్తున్నారని విమర్శించారు. గతంలో 100 రోజుల పనికి కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్రం 10 శాతం నిధులు అందించేదని, ప్రస్తుతం కొత్త విధానంలో రాష్ట్రాలపై 40 శాతం భారం మోపడం అన్యాయమని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోవడం వల్ల కూలీలకు గిట్టుబాటు కష్టమైందన్నారు. ఉపాధి కూలీలకు సంవత్సరానికి కనీసం 200 రోజుల పని కల్పించాలని, రోజువారీ కూలీ రూ.600గా నిర్ణయించాలని, కేంద్రం 90 శాతం నిధులు భరించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఉపాధి పనిని 150 రోజులకు పెంచడం, రోజుకూలి రూ.400 చెల్లించడం, పట్టణాల్లో ఉపాధి కల్పించడం, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' కింద సంవత్సరానికి రూ.12,000 ఇవ్వడం, మహిళలకు నెలకు రూ.2,500 చెల్లించడం, పేదలకు ఇళ్లు కల్పించడం వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, ఐద్వా మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, ప్రజానాట్య మండలి నాయకులు కండే సత్యం, అయినంపూడి సనందరావు, తడికమల్ల రామకృష్ణ, బెజవాడ లక్ష్మీనారాయణ, పరిమి సీతామాలక్ష్మి, వల్లెపు లక్ష్మి, వింజి భార్గవి, కారుమంచి శ్రీలక్ష్మి, మారోజు శ్యామల, గద్దల వెంకటేశ్వరరావు, బలుసుపాటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాలకు వినతిపత్రాలు సమర్పించారు.



# ఆగారం గ్రామంలో జల మహోత్సవం నిర్వహణ

**ఘనపూర్,ఏప్రిల్20(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా ఘనపూర్ మండలంలోని ఆగారం గ్రామంలో సోమవారం జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో జల మహోత్సవ కార్యక్రమం నిర్వహించబడింది. హర్ ఘర్ జల్ కార్యక్రమంలో భాగంగా మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్న తాగునీటిని ప్రజలు వినియోగించుకోవాలని అధికారాలు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మిషన్ భగీరథ డీఈ హరీష్ కుమార్, ఏఈ నరేష్ కుమార్ పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ భగీరథ నీరు సురక్షితమైనదని, ప్రతి ఒక్కరూ తాగునీటిని ఉపయోగించుకోవాలని తెలిపారు. మండల కాంగ్రెస్ నాయకుడు మున్నూరు జయాకర్ మాట్లాడుతూ.. గ్రామంలో మిషన్ భగీరథ నీరు సకాలంలో అందుతున్నదని, ప్రజలు నీటిని జాగ్రత్తగా వినియోగిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

# రైతు రిజిస్ట్రేషన్ లేకుంటే పథకాల నిలిపివేత

- పీఎం కిసాన్, ఎరువుల సరఫరాపై ప్రభావం.
- ఏఓ ఎస్ .చంద్రశేఖర్ రెడ్డి.

**దమ్మపేట, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**



మండలంలోని రైతులు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు. మండలంలో మొత్తం 11,200 మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 8,200 మంది మాత్రమే నమోదు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా సుమారు 3,100 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని పేర్కొన్నారు. రైతు రిజిస్ట్రేషన్ లేకుంటే పీఎం కిసాన్, ఎరువుల సరఫరా తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి నిలిచిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల్లో ఉన్న రైతులు ఎక్కువగా నమోదు చేయించుకోలేదని తెలిపారు. అలాంటి రైతులు తమకు సమీపంలోని మీసేవ కేంద్రాలు, సిఎస్‌సి సెంటర్లు లేదా వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించి వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. మిగిలిన రైతులందరూ ఆలస్యం చేయకుండా రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు.



# తాటిపాములలో ఇంటర్ విద్యార్థుల ఘన సన్మానం

**వనపర్తి,ఏప్రిల్ 20(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా తాటిపాముల గ్రామానికి చెందిన ప్రభుత్వ మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను వారి స్వగృహాల్లో ఘనంగా సన్మానించి అభినందించారు.గ్రామ మాజీ సర్పంచ్ సత్యం యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు వెంకట్రాములు ద్వారా సమాచారం తెలుసుకున్న శంకర్ గౌడ్, వారితో కలిసి ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లి సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సుకన్య 987 మార్కులు, కళ్యాణి 825 మార్కులు సాధించగా, ప్రథమ సంవత్సరం విద్యార్థులు మేఘన 464, మరో విద్యార్థిని 458, బిందు 433 మార్కులు సాధించారు.అలాగే సుకన్య, మౌనిక, సతీష్, భారతి తదితరులను కూడా సన్మానించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.చదువుతో పాటు పరిసరాలు, సమాజం, కుటుంబం పట్ల అవగాహన పెంపొందించుకుని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని, తమ గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో దేశి రాములు యాదవ్, సత్యం యాదవ్, వెంకట్రాములు, నాగన్న, డా. నారాయణ, తెలుగు శ్రీను ఆంజనేయులు, సుక్య నాయక్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






# అశ్వారావుపేటలో "కలికలు" పుస్తకావిష్కరణ

- లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ.

**అశ్వారావుపేట, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

నియోజకవర్గ కేంద్రంలో విద్యా అభివృద్ధికి మరో ముందడుగు పడింది. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు రూపొందించిన "కలికలు" పుస్తకాన్ని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆవిష్కరించారు. తదుపరి ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యవసర వైద్య చికిత్సల సమయంలో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన వారు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం ప్రభుత్వానికి ప్రాధాన్యమని, త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, తుమ్మా రాంబాబు, జూపల్లి ప్రమోద్, కోలా లక్ష్మీనారాయణ, ఎంఈఓ ప్రసాదరావు, కాంప్లెక్స్ హెచ్ఎంలు హరిత, షహీనాబేగం, కొండల రావు, వీరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవులు వృథా కాకుండా_ _ _ విజ్ఞానంగా మార్చుకోండి!

- అవసరానికి మాత్రమే ఫోన్ ఉపయోగించడం అలవాటు చేసుకోండి.
- విద్యార్థులకు సూచనలు.

**సత్తుపల్లి, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**



స్థానిక పట్టణంలోని విశ్వశాంతి విద్యాలయంలో విద్యా సంవత్సరం ముగిసిన సందర్భంగా సోమవారం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు, ఫైనల్ పరీక్షల సమాధాన పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు హాజరై, తమ పిల్లల విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు, సత్యనారాయణ మరియు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలానుగుణంగా విద్యా విధానంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గణితం, తెలుగు, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, ఏఐ టెక్నాలజీ వంటి ముఖ్య అంశాల్లో పటిష్టమైన పునాది వేసుకోవాలని సూచించారు. వేసవి శిక్షణలో భాగంగా ఈ కోర్సులు విశ్వశాంతి విద్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. మొబైల్ ఫోన్ వినియోగాన్ని పరిమితం చేయడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లు కూడా విద్యార్థుల అభివృద్ధికి అవసరమని చెప్పారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువుపై దృష్టి పెట్టి రాబోయే విద్యా సంవత్సరానికి సిద్ధంగా ఉండాలని ప్రిన్సిపల్ సూచించారు.

# దుబ్బ మల్లికార్జున స్వామి దేవస్థానం పాలకవర్గానికి ఘన సన్మానం

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట మండలం ధర్మారం పరిధిలోని శ్రీ దుబ్బ మల్లికార్జున స్వామి దేవస్థానం కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ముద్ధమల్ల రవీందర్‌తో పాటు పాలకవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించారు.
ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, మహిమాన్వితమైన దుబ్బ మల్లికార్జున స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కొత్త పాలకవర్గానికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు. దేవస్థానానికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి, ఆలయాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఎఎంసీ ఉపాధ్యక్షుడు సతీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సలీం, యువ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, శ్రీనివాస్, అశోక్, నెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.




# బలీదుపల్లిలో ఐకేపీ వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**అడ్డాకల్,ఏప్రిల్20(తెలంగాణ ముచ్చట్లు):**

మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకల్ మండలం బలీదుపల్లి గ్రామంలో నర్సరీ సమీపంలో ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ మహిళా అధ్యక్షురాలు మంగరాయి భార్గవి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏపీఎం మహేష్ మాట్లాడుతూ రైతులు అందరూ ఈ వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర ప్రయోజనాలను పొందేందుకు రైతులు తమ వరిని నేరుగా కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీసీ యాదగిరి, సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కళ్యాణి, ఏఈఓ మదన్ మోహన్, ఉప సర్పంచ్ రాధ శివ, మహిళా సంఘం కార్యదర్శి మైముద్, కోశాధికారి సంధ్య, బుక్ కీపర్ శ్రీధర్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, రైతులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# చిన్న వ్యాపారాలు నిలబడటానికి పోరాటం

- ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక చిన్న వ్యాపారాలే
- పెరుగుతున్న ఖర్చులు – క్షీణిస్తున్న లాభాలు
- సాంకేతికత, పోటీ – మార్పుకు సమయం




**డెస్క్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ ఆర్థిక వ్యవస్థలో చిన్న వ్యాపారాల ప్రాధాన్యం అనిర్వచనీయమైనది. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాల వరకూ ప్రతి చోటా ఇవే ఉపాధి అవకాశాలకు ప్రధాన ఆధారం. పెద్ద పరిశ్రమలు ఎంత అభివృద్ధి చెందినా, సామాన్య ప్రజలకు జీవనోపాధి కల్పించేది చిన్న వ్యాపారాలే. అయితే, మారుతున్న ఆర్థిక పరిస్థితులు, ప్రపంచీకరణ ప్రభావం, వినియోగదారుల అభిరుచుల్లో మార్పులు ఈ రంగాన్ని కుదిపేస్తున్నాయి. చిన్న వ్యాపారాల ఎదుగుదలకు అడ్డంకిగా నిలుస్తున్న ప్రధాన సమస్య ఖర్చుల పెరుగుదల. ముడి సరుకుల ధరలు రోజు రోజుకు పెరుగుతుండగా, అద్దెలు, విద్యుత్ ఛార్జీలు, రవాణా వ్యయాలు కూడా భారంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో లాభాల మార్జిన్ తగ్గిపోవడం వ్యాపారులను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తోంది. చాలా మంది వ్యాపారులు అప్పుల పాలవుతూ, కొందరు వ్యాపారాలను మూసి వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పెద్ద కంపెనీలతో పోటీ చిన్న వ్యాపారాల ముందున్న మరో పెద్ద సవాలు. భారీ ఉత్పత్తి సామర్థ్యం, తక్కువ ధరలతో పెద్ద సంస్థలు మార్కెట్‌ను ఆక్రమిస్తున్నాయి. వినియోగదారులు బ్రాండ్లపై ఎక్కువ విశ్వాసం ఉంచడం వల్ల స్థానిక వ్యాపారాలు వెనుకబడుతున్నాయి. ఈ పరిస్థితి చిన్న వ్యాపారాల నిలదొక్కుకునే అవకాశాలను మరింత కష్టతరం చేస్తోంది. ఇటీవలి కాలంలో డిజిటల్ వాణిజ్యం వేగంగా విస్తరించింది. ఆన్‌లైన్ విక్రయాలు, డిజిటల్ చెల్లింపులు వ్యాపారంలో కీలక భాగమయ్యాయి. అయితే, ఈ మార్పులకు అనుగుణంగా మారలేకపోతున్న చిన్న వ్యాపారాలు మార్కెట్‌లో వెనుకబడుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన లేకపోవడం, అవసరమైన శిక్షణ లేకపోవడం కారణంగా అనేక అవకాశాలను కోల్పోతున్నారు.

బ్యాంకింగ్ రంగంలో ఉన్న కఠిన నిబంధనలు కూడా చిన్న వ్యాపారాలపై ప్రభావం చూపుతున్నాయి. రుణాల కోసం అవసరమైన పత్రాలు, భద్రతలు అందించలేకపోవడం వల్ల చాలా మంది వ్యాపారులకు ఆర్థిక సహాయం అందడం లేదు. అధిక వడ్డీ రేట్లు కూడా భారంగా మారుతున్నాయి. దీని వల్ల వ్యాపార విస్తరణకు అవకాశాలు తగ్గిపోతున్నాయి. పన్నుల విధానం కూడా చిన్న వ్యాపారాలకు సవాలుగా మారింది. విధానాల్లో మార్పులు, పన్నుల భారాలు చిన్న వ్యాపారాల నిర్వహణను క్లిష్టతరం చేస్తున్నాయి. పన్నుల చెల్లింపులో అవగాహన లోపం కారణంగా అనవసర సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ అంశాల్లో సులభతరం అవసరం అనేది వ్యాపార వర్గాల అభిప్రాయం.

ఇక వినియోగదారుల అభిరుచుల్లో మార్పులు కూడా చిన్న వ్యాపారాలపై ప్రభావం చూపుతున్నాయి. ఆధునికత, బ్రాండ్లపై మక్కువ పెరగడంతో స్థానిక ఉత్పత్తుల వినియోగం తగ్గుతోంది. ఈ నేపథ్యంలో చిన్న వ్యాపారాలు నాణ్యత, సేవలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలు కొంతమేర సహాయపడుతున్నప్పటికీ, అవి అందరికీ సమర్థంగా చేరడం లేదు. రుణ సబ్సిడీలు, శిక్షణ కార్యక్రమాలు, ప్రోత్సాహకాలు ఉన్నప్పటికీ, వాటి అమలు పారదర్శకంగా ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకాలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

సాంకేతికతను అందిపుచ్చుకోవడం చిన్న వ్యాపారాల భవిష్యత్తుకు కీలకం. డిజిటల్ మార్కెటింగ్, సామాజిక మాధ్యమాల వినియోగం ద్వారా తమ ఉత్పత్తులను విస్తృతంగా ప్రచారం చేయవచ్చు. ఆన్‌లైన్ వేదికలను ఉపయోగించడం ద్వారా కొత్త మార్కెట్లను చేరుకోవచ్చు. ఇది వ్యాపార విస్తరణకు దోహదం చేస్తుంది. అలాగే, నైపుణ్యాభివృద్ధి కూడా ముఖ్యమే. వ్యాపార నిర్వహణలో ఆధునిక పద్ధతులు నేర్చుకోవడం, వినియోగదారులతో మంచి సంబంధాలు కొనసాగించడం ద్వారా స్థిరత్వం సాధించవచ్చు. కొత్త ఆలోచనలు, వినూత్న మార్గాలు అన్వేషించడం ద్వారా పోటీని ఎదుర్కొనవచ్చు.

సమాజం కూడా చిన్న వ్యాపారాలకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉంది. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం, స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా ఈ రంగాన్ని బలోపేతం చేయవచ్చు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు చేస్తుంది. మొత్తంగా చిన్న వ్యాపారాలు దేశ అభివృద్ధికి కీలక శక్తి. వీటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం, బ్యాంకులు, సమాజం కలిసి పనిచేయాలి. సరైన విధానాలు, మద్దతు ఉంటే చిన్న వ్యాపారాలు మరింత బలపడతాయి.

చిన్న వ్యాపారాల పరిరక్షణ అంటే కేవలం ఒక రంగాన్ని కాపాడటం కాదు, లక్షలాది కుటుంబాల భవిష్యత్తును భద్రపరచడం. అందుకే ఈ రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం అత్యవసరం.

# కొత్త ఆలోచనలతో అభివృద్ధి దిశగా సమాజం

- ప్రపంచ సృజనాత్మకత ఆవిష్కరణల దినోత్సవం ప్రాముఖ్యత
- యువతలో సృజనాత్మకతకు ప్రోత్సాహం
- భవిష్యత్తు నిర్మాణంలో ఆవిష్కరణల పాత్ర

**డెస్క్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది ఏప్రిల్ 21న సృజనాత్మకత ఆవిష్కరణల దినోత్సవాన్ని జరుపుకుంటారు. సమాజం అభివృద్ధి చెందడానికి కొత్త ఆలోచనలు ఎంత ముఖ్యమో గుర్తు చేయడానికి ఈ దినోత్సవం ఉపయోగపడుతుంది. మన రోజువారీ జీవితంలో చిన్న చిన్న మార్పులు కూడా పెద్ద పరిణామాలకు దారితీస్తాయని ఈ రోజు తెలియజేస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న ఈ కాలంలో సృజనాత్మకత కీలక పాత్ర పోషిస్తోంది. వ్యవసాయం నుండి వైద్యం వరకు ప్రతి రంగంలో కొత్త ఆలోచనలు మార్పులకు కారణమవుతున్నాయి. ఆవిష్కరణల వల్ల సమయం ఆదా అవుతూ, పనితీరు మెరుగుపడుతోంది. యువతలో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ దినోత్సవం ఒక మంచి వేదికగా నిలుస్తోంది. విద్యాసంస్థలు వివిధ పోటీలు, చర్చలు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయి. కొత్తగా ఆలోచించే అలవాటు పెంపొందించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

సృజనాత్మకత కేవలం విజ్ఞాన రంగానికే పరిమితం కాదు. కళలు, సాహిత్యం, సంగీతం వంటి రంగాల్లో కూడా కొత్త ఆలోచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయి. వ్యక్తిగత ప్రతిభను అభివృద్ధి చేసుకోవడానికి ఇది ఒక అవకాశంగా మారుతోంది. ఆర్థిక అభివృద్ధిలో కూడా ఆవిష్కరణలు కీలకంగా మారాయి. కొత్త వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు సృష్టించడానికి సృజనాత్మక ఆలోచనలు అవసరం. దేశ ఆర్థిక స్థితి మెరుగుపడటానికి ఇది ముఖ్య కారణంగా నిలుస్తోంది. పర్యావరణ పరిరక్షణలో కూడా సృజనాత్మకత అవసరం పెరుగుతోంది. కాలుష్యాన్ని తగ్గించడం, సహజ వనరులను సంరక్షించడం వంటి అంశాల్లో కొత్త విధానాలు అవలంబిస్తున్నారు. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణం అందించడానికి ఇది అవసరం. ప్రభుత్వాలు మరియు సంస్థలు ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. కొత్త ఆలోచనలు ఉన్నవారికి ప్రోత్సాహకాలు అందిస్తూ అభివృద్ధికి దోహదపడుతున్నాయి. సమాజంలో మార్పు తీసుకురావడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. మొత్తంగా చూస్తే సృజనాత్మకత ఆవిష్కరణలు సమాజ అభివృద్ధికి పునాది వంటివి. ప్రతి వ్యక్తి కొత్తగా ఆలోచించే అలవాటు పెంపొందించుకుంటే దేశం మరింత ముందుకు సాగుతుంది. ఈ దినోత్సవం మనందరికీ కొత్త దిశను చూపించే అవకాశంగా నిలుస్తోంది.




# ఓలా షేర్ల ర్యాలీ.. పెట్టుబడిదారుల్లో సందేహం




**డెస్క్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** గత నెల రోజులుగా ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ షేర్లు స్టాక్ మార్కెట్‌లో అసాధారణంగా దూసుకుపోతున్నాయి. కేవలం 30 రోజుల్లోనే ఈ షేరు దాదాపు 74 శాతం పెరిగి పెట్టుబడిదారులకు భారీ లాభాలను అందించింది. అలాగే 52 వారాల కనిష్ట స్థాయి రూ.22.25తో పోలిస్తే ఇప్పటివరకు సుమారు 82 శాతం రికవరీ సాధించింది. దీంతో ఇప్పుడే లాభాలను పొందాలా లేక దీర్ఘకాలికంగా కొనసాగించాలా అనే సందేహం పెట్టుబడిదారుల్లో నెలకొంది. ఈ వేగవంతమైన పెరుగుదల నేపథ్యంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఈ షేరును అదనపు పర్యవేక్షణ జాబితాలో చేర్చాయి. అంటే ఈ షేరు అధిక అస్థిరతను చూపుతుండటంతో పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నాయి.

వ్యాపార పరంగా చూస్తే ఈ సంస్థ కేవలం స్కూటర్ల విక్రయాలకే పరిమితం కాకుండా, స్వంత బ్యాటరీ సాంకేతికత అభివృద్ధిపై దృష్టి సారిస్తోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ సామర్థ్యాన్ని అందించే కొత్త బ్యాటరీల అభివృద్ధి పెట్టుబడిదారుల నమ్మకాన్ని పెంచుతోంది.

అయితే నిపుణులు మాత్రం జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. కంపెనీ భవిష్యత్తు దాని ఆర్థిక ఫలితాలు, అమ్మకాల తర్వాత సేవలు, వినియోగదారుల సంతృప్తిపై ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. టెక్నికల్ పరంగా ఈ షేరు రూ.42 స్థాయిని దాటితే రూ.50 వరకు వెళ్లే అవకాశం ఉందని అంచనా. మరోవైపు లాభాల స్వీకరణ పెరిగితే రూ.35 తరువాత రూ.32 స్థాయిల వద్ద మద్దతు లభించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ షేరు రూ.40.82 వద్ద ట్రేడవుతోంది. కాబట్టి పెట్టుబడిదారులు తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం కంటే రిస్క్‌ను అంచనా వేసుకుని ముందుకు వెళ్లాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఆందోళన కలిగిస్తున్న అగ్నిప్రమాదాలు

- అప్రమత్తత లోపం పై ఆందోళన
- పలు రాష్ట్రాల్లో వరుస ఘటనలు
- ప్రభుత్వ బాధ్యతపై ప్రశ్నలు
- భద్రతా ప్రమాణాల అమలు ఎక్కడ?
- ప్రజల్లో అవగాహన పెంపు
- ప్రమాదాల నివారణకు కీలకం





**డెస్క్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** దేశవ్యాప్తంగా ఇటీవల వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పారిశ్రామిక ప్రాంతాలు, గోదాములు, వాణిజ్య సముదాయాల్లో చోటుచేసుకుంటున్న ఈ ఘటనలు భారీ ఆస్తినష్టం కలిగించడమే కాకుండా ప్రజల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రాణనష్టం కూడా సంభవించడంతో పరిస్థితి తీవ్రత మరింత స్పష్టమవుతోంది. తాజా ఘటనల్లో అనేక రాష్ట్రాల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవడం గమనార్హం. మంటలు వేగంగా వ్యాపించడానికి కారణంగా భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, పాత విద్యుత్ వైర్లింగ్, అగ్నిమాపక పరికరాల లోపం వంటి అంశాలు ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. కొన్ని చోట్ల అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోపే మంటలు అదుపు తప్పడంతో నష్టం మరింత పెరిగింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ బాధ్యతపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. అగ్నిసురక్షా నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తున్నామా? తనిఖీలు సమయానికి జరుగుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతాలు, గోదాములు, వాణిజ్య భవనాల్లో నిరంతర తనిఖీలు నిర్వహించి లోపాలను గుర్తించి సరిదిద్దాల్సిన అవసరం ఉంది. కఠిన చర్యలు తీసుకోకపోతే ఇలాంటి ప్రమాదాలు పునరావృతమయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం మాత్రమే కాకుండా వ్యాపార సంస్థలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. భద్రతా ప్రమాణాలను పాటించడం, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచడం, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం వంటి చర్యలు తప్పనిసరి. ప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలో ఉద్యోగులకు అవగాహన కల్పించడం అత్యంత ముఖ్యమైంది. ఇక ప్రజల్లో అవగాహన పెంపు కూడా సమానంగా అవసరం. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందనే విషయాన్ని గుర్తించాలి. గ్యాస్, విద్యుత్ పరికరాల వినియోగంలో జాగ్రత్తలు పాటించడం, అనుమానాస్పద పరిస్థితుల్లో వెంటనే సమాచారం ఇవ్వడం వంటి చర్యలు ప్రమాదాలను తగ్గించగలవు. పట్టణాల్లో పెరుగుతున్న జనసాంద్రత, అనియంత్రిత నిర్మాణాలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. భవన నిర్మాణంలో భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించకపోవడం వల్ల అగ్నిప్రమాదాలు వేగంగా వ్యాపిస్తున్నాయి. దీనిపై సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అగ్నిమాపక శాఖను మరింత బలోపేతం చేయడం కూడా అత్యవసరం. ఆధునిక పరికరాలు, తగిన సిబ్బంది, వేగవంతమైన స్పందన వ్యవస్థతో ఈ విభాగాన్ని మరింత సమర్థవంతంగా మార్చాలి. అత్యవసర సేవల సమన్వయం మెరుగుపడితే ప్రాణనష్టం, ఆస్తినష్టం తగ్గించే అవకాశం ఉంటుంది. మొత్తంగా చూస్తే అగ్నిప్రమాదాలు కేవలం ఒక సంఘటనగా కాకుండా ఒక హెచ్చరికగా భావించాలి. ప్రభుత్వం, వ్యాపారులు, ప్రజలు కలిసి పనిచేస్తేనే ఈ సమస్యను సమర్థంగా ఎదుర్కొనవచ్చు. భద్రతా ప్రమాణాల అమలు, అవగాహన పెంపు, సమయానుకూల చర్యలు తీసుకుంటే ఇటువంటి ఘటనలను నివారించడం సాధ్యమే. ప్రతి అగ్నిప్రమాదం ఒక పాఠంగా మారాలి. అప్రమత్తతే రక్షణ అనే విషయాన్ని గుర్తుంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మన ప్రాణాలు, ఆస్తిని కాపాడుకోవచ్చు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# పునరావృత వ్యాజ్యాలపై కోర్టు ఆగ్రహం

- నేతాజీ అంశాలపై పిల్‌లు సుప్రీంకోర్టు అసహనం
- చారిత్రక విషయాల్లో న్యాయస్థానాల పరిమితులు
- భవిష్యత్తులో పిల్‌లపై కఠిన హెచ్చరిక



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** సుభాష్ చంద్రబోస్ కు సంబంధించిన చారిత్రక అంశాలపై పదేపదే ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు కావడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. నేతాజీ స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీ వల్లే భారత స్వాతంత్ర్యం సాధ్యమైందని ప్రకటించాలని, ఆయనకు "జాతీయ పుత్రుడు" హోదా ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిల్‌ను కోర్టు కొట్టివేసింది. ప్రజా ప్రయోజన వ్యాజ్యాల పేరుతో వ్యక్తిగత ప్రచారం కోసం కోర్టులను ఆశ్రయించడం సరైంది కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌ను సూర్యకాంత్, జాయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ పినాక్‌పాణి మొహంతి గతంలో కూడా ఇదే అంశంపై పిల్ దాఖలు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ కోర్టు తీవ్రంగా స్పందించింది. కేవలం ప్రజాదరణ కోసం ఇలాంటి పిటిషన్లు వేస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. చారిత్రక వాస్తవాలను నిర్ణయించడం న్యాయస్థానాల పరిధిలోకి రాదని స్పష్టంచేసింది.

పిటిషన్‌లో నేతాజీ పుట్టినరోజు జనవరి 23, ఐఎన్‌ఏ స్థాపక దినోత్సవం అక్టోబర్ 21లను జాతీయ సెలవులుగా ప్రకటించాలని, కటక్‌లోని ఆయన జన్మస్థలాన్ని జాతీయ మ్యూజియంగా గుర్తించాలని కూడా కోరారు. అయితే ఈ డిమాండ్లన్నింటినీ కోర్టు తిరస్కరించింది. భవిష్యత్తులో ఇదే అంశంపై పినాక్‌పాణి మొహంతి నుంచి వచ్చే పిల్‌లను స్వీకరించవద్దని సుప్రీంకోర్టు తన రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది.

ఇంతకుముందు కూడా నేతాజీ భౌతిక అవశేషాలను జపాన్ నుంచి భారత్‌కు తీసుకురావాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఆ సమయంలో ధర్మాసనం "ఈ అంశంపై ఇంకెన్నిసార్లు కోర్టుకు వస్తారు?" అని ప్రశ్నించింది. నేతాజీ కుమార్తె అనితా బోస్ స్వయంగా కోర్టును ఆశ్రయించాలని సూచించింది. ప్రజా ప్రయోజన వ్యాజ్యాల పరిమితులను గౌరవించాలని, కోర్టు సమయాన్ని వృథా చేయవద్దని స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది.

# ఉధంపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం



- లోయలో పడిన బస్సు, 15 మంది మృతి
- మలుపు వద్ద అదుపు తప్పిన బస్సు
- గాయపడిన వారి పరిస్థితి విషమం
- సహాయక చర్యలు కొనసాగింపు

**ఉధంపూర్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మూ కశ్మీర్లోని ఉధంపూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రామ్‌నగర్ సమీపంలోని కాగోర్ట్ గ్రామం వద్ద ఓ బస్సు లోయలో పడిపోవడంతో 15 మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో జరిగింది. మ్‌నగర్ నుంచి ఉధంపూర్‌కు వెళ్తున్న బస్సు, ప్రమాదకరమైన మూలమలుపు వద్ద అదుపు తప్పి లోయలోకి జారిపడినట్లు అధికారులు తెలిపారు. ప్రాంతం కొండ ప్రాంతం కావడంతో రహదారి మలుపులు ప్రమాదకరంగా ఉండటం ఈ ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రమాదం తీవ్రత కారణంగా బస్సు పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, రక్షణ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ ఘటనపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ, స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులో ఉన్నట్లు తెలిపారు. బాధితులకు అవసరమైన సహాయం అందించాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. ఈ దుర్ఘటన ప్రాంతంలో విషాదాన్ని నింపింది.

# భారత్–దక్షిణ కొరియా వాణిజ్య భాగస్వామ్యానికి కొత్త ఊపు

- వాణిజ్య చర్చల పునఃప్రారంభంపై చర్చ
- గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రేడ్‌లో సహకారం
- పరస్పర పెట్టుబడులకు ప్రాధాన్యం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ దక్షిణ కొరియా వాణిజ్య మంత్రితో సమావేశమై ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలపై కీలక చర్చలు జరిపారు. కొరియా గణరాజ్యానికి చెందిన వాణిజ్య మంత్రి యియో హాన్‌కూతో జరిగిన ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే దిశగా చర్చలు సాగాయి. ఈ సందర్భంగా భారత్-కొరియా సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం ) అప్‌గ్రేడ్ చర్చలను తిరిగి ప్రారంభించే అవకాశాలపై ఇరు దేశాలు చర్చించాయి. ఈ ఒప్పందాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చి, వాణిజ్యాన్ని మరింత పెంచే దిశగా ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

పారిశ్రామిక సహకారం, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంచడంపై కూడా చర్చలు జరిగాయి. పర్యావరణ హితమైన అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని ఇరు దేశాలు అభిప్రాయపడ్డాయి. శక్తి వినియోగంలో కొత్త సాంకేతికతలను వినియోగించడం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు సాధ్యమవుతాయని నిపుణులు భావిస్తున్నారు. డిజిటల్ ట్రేడ్ రంగంలో కూడా సహకారాన్ని విస్తరించేందుకు అవకాశాలను అన్వేషించారు. డిజిటల్ ఎకానమీ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ రంగంలో పరస్పర సహకారం వాణిజ్యాన్ని కొత్త దశకు తీసుకెళ్తుందని అధికారులు పేర్కొన్నారు.

భారత్ మరియు దక్షిణ కొరియా మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేయాలని ఇరు దేశాలు సంకల్పించాయి. పరస్పర పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వృద్ధికి దోహదం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశం ద్వారా ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడతాయని, భవిష్యత్‌లో వాణిజ్య అవకాశాలు విస్తరించనున్నాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భారత్-కొరియా భాగస్వామ్యం గ్లోబల్ వాణిజ్యంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సంయుక్త శిక్షణతో సామర్థ్యాల పెంపు



- ఆర్మీ, సీఐఎస్ఎఫ్ కలయిక
- గోవాలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం
- యుద్ధ, సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి
- అత్యవసర పరిస్థితుల స్పందనకు సిద్ధత

**గోవా, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** భారత సైన్యం మరియు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సంయుక్తంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమం గోవాలో విజయవంతంగా పూర్తైంది. బాంబోలిమ్‌లోని 2వ సిగ్నల్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మోపా, గోవా విమానాశ్రయాల నుంచి వచ్చిన సీఐఎస్ఎఫ్ క్విక్ రియాక్షన్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు. భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యంగా అధికారులు తెలిపారు.

ఈ శిక్షణలో భాగంగా సిబ్బందికి శారీరక దృఢత్వాన్ని పెంచే వ్యాయామాలతో పాటు యుద్ధ పరిస్థితుల్లో ఎలా స్పందించాలి అనే అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆయుధాల వినియోగం, శత్రువులను ఎదుర్కొనే పద్ధతులు, అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టే విధానాలపై ప్రాక్టికల్ ట్రైనింగ్ అందించారు. శిక్షణలో ప్రతి అంశం కఠినంగా అమలు చేసినట్లు సమాచారం. అదేవిధంగా గాయపడిన వారిని రక్షించే విధానాలు, ఫీల్డ్‌లో సమన్వయం, నావిగేషన్ వంటి కీలక అంశాలపై కూడా సిబ్బందిని శిక్షణ ఇచ్చారు. రియల్ టైమ్ పరిస్థితులను అనుకరించే మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా సిబ్బందికి ప్రత్యక్ష అనుభవం కల్పించారు. ఇది భవిష్యత్‌లో జరిగే ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా వేగంగా స్పందించేందుకు సహాయపడుతుంది.

సాంకేతికంగా కూడా సిబ్బందిని అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. డ్రోన్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆధునిక భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ శిక్షణను రూపొందించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఈ కఠిన శిక్షణతో సిబ్బందిలో ఆత్మవిశ్వాసం, శారీరక సామర్థ్యం, సహనం గణనీయంగా పెరిగినట్లు తెలిపారు. ఒకరితో ఒకరు సమన్వయంతో పని చేయగల సామర్థ్యం కూడా మెరుగుపడిందని పేర్కొన్నారు. సంయుక్త శిక్షణ వల్ల రెండు దళాల మధ్య సమన్వయం మరింత బలపడిందని చెప్పారు. దేశ భద్రత కోసం సంయుక్త చర్యలు ఎంత ముఖ్యమో ఈ శిక్షణ మరోసారి చాటిచెప్పింది. భవిష్యత్‌లో కూడా ఇలాంటి సంయుక్త శిక్షణ కార్యక్రమాలను కొనసాగిస్తూ భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులు నిర్ణయించారు. అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా స్పందించేందుకు ఇది కీలకంగా మారనుంది.

# ముగ్గురు అన్నదమ్ముల మృతి

- థ్రిల్ కోసం చేసిన ట్రిపుల్ రైడింగ్
- హైస్పీడ్ స్టంట్ ప్రమాదానికి దారి
- సెల్‌ఫోన్‌లో రికార్డ్ అయిన ఘటన వైరల్
- ప్రమాదకర డ్రైవింగ్‌పై హెచ్చరికలు



**భోపాల్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మధ్యప్రదేశ్లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మౌగంజ్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు ప్రాణాలు కోల్పోయారు. థ్రిల్ కోసం చేసిన ట్రిపుల్ రైడింగ్ వారి ప్రాణాలను బలితీసుకుంది. ఈ ఘటన ఏప్రిల్ 14న చోటుచేసుకోగా, దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వేపై అధిక వేగంతో ప్రయాణిస్తూ స్టంట్‌లు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ముగ్గురు ఒకే బైక్‌పై ప్రయాణిస్తూ, మరో బైక్‌పై ఉన్న వ్యక్తులు వీరి ప్రయాణాన్ని వీడియోగా చిత్రీకరించారు. ఈ క్రమంలో ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న బైక్ ఓవర్‌టేక్ చేసే సమయంలో అదుపు తప్పింది. ప్రమాదానికి ముందు వారిలో ఒకరు చేతిలో గన్ పట్టుకుని సంకేతాలు చేస్తున్న దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి.

ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో ముందుగా వెళ్తున్న ఇటుకల లారీ అకస్మాత్తుగా కనిపించడంతో, బైక్ నేరుగా దానిని ఢీకొట్టింది. ఢీకొన్న వేగం తీవ్రంగా ఉండటంతో ముగ్గురు అన్నదమ్ములు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదం తీవ్రతను బట్టి వారి ప్రాణాలను రక్షించడం అసాధ్యమైంది. వీడియో తీస్తున్న మరో బైక్‌పై ఉన్న ఇద్దరికీ కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. థ్రిల్ కోసం చేసిన ప్రమాదకర స్టంట్‌లు ఎంతటి విషాదానికి దారి తీస్తాయో ఈ ఘటన స్పష్టంగా చూపిస్తోంది. ట్రాఫిక్ నియమాలను పాటించడం, భద్రతా జాగ్రత్తలు తీసుకోవడం ఎంత ముఖ్యమో నిపుణులు మరోసారి గుర్తు చేస్తున్నారు.

# ప్రత్యేక ఆపరేషన్లలో సామర్థ్యాల పెంపు

- భారత్–ఉజ్బెకిస్తాన్ సంయుక్త సైనిక వ్యాయామం 'డస్ట్‌లిక్–2026' ప్రారంభం
- నామంగాన్‌లో సంయుక్త శిక్షణ
- అర్ధ పర్వత ప్రాంతాల్లో యుద్ధ సిద్ధతపై దృష్టి

**నామంగాన్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** భారత సైన్యం, ఉజ్బెకిస్తాన్ సైన్యం మధ్య జరిగే సంయుక్త సైనిక వ్యాయామం 'డస్ట్‌లిక్-2026' ఉజ్బెకిస్తాన్‌లోని గురుమ్సరాయ్ ఫీల్డ్ ట్రైనింగ్ ఏరియాలో ప్రారంభమైంది. ఏప్రిల్ 12 నుంచి 25 వరకు జరుగుతున్న ఈ వ్యాయామం రెండు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కొనసాగుతోంది. ఈ వ్యాయామం ముఖ్యంగా అర్ధ పర్వత ప్రాంతాల్లో సంయుక్తంగా ఆపరేషన్లు నిర్వహించే సామర్థ్యాన్ని పెంపొందించడంపై కేంద్రీకృతమైంది. సంయుక్త ప్రణాళిక, వ్యూహాత్మక విన్యాసాలు, ప్రత్యేక ఆయుధ వినియోగ నైపుణ్యాలు, అక్రమ సాయుధ గుంపులపై చర్యలు చేపట్టే విధానాలపై శిక్షణ ఇస్తున్నారు. రెండు దేశాల సైన్యాలు సమన్వయంతో పని చేయగలిగేలా ప్రత్యేకంగా ఈ వ్యాయామాన్ని రూపొందించారు. శిక్షణలో భాగంగా సైనికులు ప్రాంత పరిచయం, వ్యూహాల మార్పిడి, ఆయుధ వినియోగం వంటి అంశాల్లో అనుభవాన్ని పెంపొందించుకుంటున్నారు. అంబిడెక్స్ట్రస్ పిస్టల్ ఫైరింగ్, రిఫ్లెక్స్ షూటింగ్, ఆర్పీజీ ఫైరింగ్, నిరాయుధ పోరాటం, బేయోనెట్ ఫైటింగ్ వంటి విభిన్న అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నారు. ఇది యుద్ధ పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు సహాయపడుతుంది. అదనంగా యూఏవీ వినియోగం, అర్బన్ ప్రాంతాల్లో ఫైర్ అండ్ మూవ్ డ్రిల్స్, గాయపడిన వారిని తరలించే విధానాలు, రికానైసెన్స్, సర్వైలెన్స్ వంటి అంశాలపై కూడా శిక్షణ కొనసాగుతోంది. హౌస్ ఇంటర్వెన్షన్ డ్రిల్స్, స్నైపర్ ట్రైనింగ్, మౌంటనీరింగ్, రాపెల్లింగ్ వంటి ప్రత్యేక నైపుణ్యాలు సైనికులకు అందిస్తున్నారు. సైనికుల శారీరక దృఢత్వం పెంచేందుకు పరుగులు, వ్యాయామాలు, యోగా వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టీమ్ స్పిరిట్ పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ శిక్షణతో సైనికులలో ఆత్మవిశ్వాసం, సమన్వయం, సహనం గణనీయంగా పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ వ్యాయామం మరింత క్లిష్టమైన సంయుక్త ఆపరేషన్ల దిశగా కొనసాగనుంది. శత్రు లక్ష్యాలపై దాడులు, హెలిబోర్న్ ఆపరేషన్లు, సంయుక్త కమాండ్ వ్యవస్థ ఏర్పాటు వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. దీంతో భారత్-ఉజ్బెకిస్తాన్ సైన్యాల మధ్య సమన్వయం మరింత బలపడుతూ, భవిష్యత్ భద్రతా సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.



# బ్రోకోలీతో ఆరోగ్యానికి బలమైన కవచం

- పోషకాల నిలయం బ్రోకోలీ
- రోగనిరోధక శక్తికి తోడ్పాటు
- రోజువారీ ఆహారంలో చేర్చుకోవాల్సిన అవసరం

**డెస్క్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవలి కాలంలో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో బ్రోకోలీ అనే కూరగాయకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడుతోంది. పచ్చని రంగులో కనిపించే ఈ కూరలో అనేక విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండటంతో ఇది శరీరానికి అవసరమైన పోషకాలను అందించే ముఖ్య ఆహారంగా మారుతోంది. ముఖ్యంగా విటమిన్ సి, విటమిన్ కె, ఫైబర్ అధికంగా ఉండటంతో ఆరోగ్య నిపుణులు దీన్ని రోజువారీ ఆహారంలో చేర్చాలని సూచిస్తున్నారు. బ్రోకోలీ లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని విషపదార్థాలను తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి కణాల నష్టం తగ్గించి దీర్ఘకాలిక వ్యాధులను నివారించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం వంటి వ్యాధుల నుంచి రక్షణ కల్పించే లక్షణాలు ఇందులో ఉన్నాయి. అలాగే జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో కూడా బ్రోకోలీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో బ్రోకోలీ కీలక పాత్ర పోషిస్తుంది. శరీరానికి అవసరమైన పోషకాలు అందించడం ద్వారా వైరస్‌లు, బ్యాక్టీరియా వంటి సంక్రమణల నుంచి రక్షణ కల్పిస్తుంది. పిల్లలు, పెద్దలు అందరూ దీన్ని తినడం వల్ల ఆరోగ్యంగా ఉండగలరని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధులకు ఇది మరింత ఉపయోగకరంగా ఉంటుంది. అయితే బ్రోకోలీని సరైన విధంగా వండుకుని తినడం చాలా ముఖ్యం. ఎక్కువసేపు ఉడికిస్తే ఇందులోని పోషకాలు తగ్గే అవకాశం ఉంది. అందువల్ల తక్కువ వేడి మీద ఉడికించడం లేదా ఆవిరి వేపడం ద్వారా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. రోజువారీ ఆహారంలో బ్రోకోలీని చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



# గుండె ఆరోగ్యానికి ఏ ఆహారం మంచిది?

గుండె ఆరోగ్యం కాపాడుకోవడం కోసం సరైన ఆహారం తీసుకోవడం అత్యంత అవసరం. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, అసమయ భోజనం, జంక్ ఫుడ్ వినియోగం పెరగడంతో గుండె సంబంధిత సమస్యలు అధికమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సరైన ఆహారపు అలవాట్లు గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వైద్యులు సూచిస్తున్నారు. గుండె ఆరోగ్యానికి పచ్చి కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, గింజలు వంటి ఆహారాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ముఖ్యంగా ఆకుకూరలు, క్యారెట్, టమోటా వంటి కూరగాయలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. బాదం, వేరుశెనగ, వాల్‌నట్ వంటి గింజలు మంచి కొవ్వులను అందించి గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. అలాగే బ్రౌన్ రైస్, ఓట్స్ వంటి ఆహారాలు కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడతాయి. చేపలు కూడా గుండె ఆరోగ్యానికి మంచివిగా భావించబడుతున్నాయి. ఇందులో ఉండే ఒమేగా కొవ్వు ఆమ్లాలు గుండెను రక్షించడంలో కీలకంగా పనిచేస్తాయి. అయితే ఎర్ర మాంసం, వేయించిన పదార్థాలు, అధిక ఉప్పు, చక్కెర కలిగిన ఆహారాలను తగ్గించడం అవసరం. ఇవి గుండెపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. రోజువారీ ఆహారంలో సరైన మార్పులు చేసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు. సమయానికి భోజనం చేయడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం వంటి అలవాట్లు చాలా ముఖ్యమైనవి. ఈ విధంగా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా గుండె సంబంధిత సమస్యలను నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు.



# మామిడి పచ్చడి ఎందుకు చేసుకుంటారు?

- సంప్రదాయం, రుచికి ప్రతీకగా పచ్చడి
- ఎండాకాలంలో శరీరానికి అవసరమైన గుణాలు
- భోజనానికి రుచిని పెంచే ప్రత్యేక పదార్థం

**డెస్క్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఎండాకాలం రాగానే ఇళ్లలో మామిడి పచ్చడి తయారీ మొదలవుతుంది. ఇది కేవలం రుచికోసం మాత్రమే కాకుండా, సంప్రదాయం, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తయారు చేసే ఆహారం. పండని మామిడి కాయలతో తయారయ్యే ఈ పచ్చడి తెలుగు కుటుంబాల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. మామిడి పచ్చడి ప్రధానంగా రుచిని పెంచడానికి ఉపయోగపడుతుంది. అన్నంతో కలిపి తింటే భోజనం మరింత రుచికరంగా మారుతుంది. మామిడి కాయలో ఉండే పులుపు, కారం, ఉప్పు కలయిక ఆకలిని పెంచడంలో సహాయపడుతుంది. వేసవిలో ఆకలి తగ్గే సమయంలో పచ్చడి తినడం వల్ల తినాలనే ఆసక్తి పెరుగుతుందని పెద్దలు చెబుతారు. ఆరోగ్య పరంగా కూడా మామిడి పచ్చడి కొంత ప్రయోజనం కలిగిస్తుంది. మామిడికాయలో ఉండే విటమిన్లు, ఖనిజాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. అలాగే పచ్చడిలో ఉపయోగించే నూనె, మసాలాలు కొంతమేర శక్తిని అందిస్తాయి. అయితే మితంగా తీసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు, ఎందుకంటే ఎక్కువ ఉప్పు, కారం ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చు. సంప్రదాయ పరంగా చూస్తే మామిడి పచ్చడి ఒక కుటుంబ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. వేసవి కాలంలో పెద్దలు, చిన్నలు కలిసి పచ్చడి తయారు చేయడం ఒక ఆనవాయితీగా ఉంది. ఇది కుటుంబ బంధాలను బలపరచడంలో కూడా సహాయపడుతుంది. ఈ విధంగా మామిడి పచ్చడి రుచికి మాత్రమే కాకుండా, ఆరోగ్యం, సంప్రదాయానికి కూడా ప్రతీకగా నిలుస్తోంది.



# గాజులు – ఆచారానికి అలంకారం, ఆరోగ్యానికి సూచిక

- శతాబ్దాల సంప్రదాయానికి ప్రతీకగా గాజులు
- అందం, ఆత్మవిశ్వాసం, సామాజిక భావాల ప్రతిఫలం
- ఆరోగ్యం, ఫ్యాషన్ కలిసిన ఆధునిక గాజుల ప్రపంచం

**డెస్క్, ఏప్రిల్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ సంస్కృతిలో గాజులు అనేవి కేవలం అలంకరణ సాధనం మాత్రమే కాకుండా, ఒక భావోద్వేగానికి, సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. పురాతన కాలం నుంచే మహిళలు గాజులు ధరించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. వివాహిత స్త్రీలు గాజులు ధరించడం శుభసూచకంగా భావించబడుతుండగా, పండుగలు, శుభకార్యాల్లో గాజుల వినియోగం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రతి రంగుకు ఒక ప్రత్యేక అర్థం ఉందని పెద్దలు చెబుతారు. పచ్చ గాజులు సిరిసంపదను సూచిస్తే, ఎరుపు గాజులు ఆనందం, శుభాన్ని సూచిస్తాయని విశ్వాసం ఉంది. మహిళల అందాన్ని పెంపొందించడంలో గాజులు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. చేతులపై మెరిసే గాజులు మహిళల వ్యక్తిత్వాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చుతాయి. గాజులు ధరించడం ద్వారా ఒక ప్రత్యేకమైన ఆత్మవిశ్వాసం మహిళల్లో పెరుగుతుందని కూడా భావిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు, పట్టణాల్లో కూడా గాజులపై ఆసక్తి తగ్గకుండా కొనసాగుతోంది. వివాహ వేడుకల సమయంలో ప్రత్యేకంగా గాజుల అలంకరణకు పెద్దపీట వేస్తారు. పెళ్లికూతురికి ప్రత్యేకంగా గాజులు ఎంపిక చేయడం ఒక సంప్రదాయంగా మారింది. గాజులు గాజు, బంగారం, వెండి, లాక్, ప్లాస్టిక్ వంటి పలు పదార్థాలతో తయారవుతాయి. గాజు గాజులు సాంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తే, బంగారు గాజులు ఆర్థిక స్థితిని ప్రతిబింబిస్తాయి. ఆధునిక కాలంలో డిజైనర్ గాజులు కూడా మార్కెట్లోకి వస్తున్నాయి. యువత అభిరుచులకు అనుగుణంగా కొత్త నమూనాలు, రంగులు అందుబాటులోకి రావడంతో గాజుల మార్కెట్ విస్తృతమవుతోంది. ఆన్‌లైన్ వేదికల ద్వారా కూడా గాజులు సులభంగా లభిస్తున్నాయి. ఆరోగ్య పరంగా కూడా గాజులు కొంతమేర ప్రయోజనం కలిగిస్తాయని విశ్వాసం ఉంది. మణికట్టు వద్ద గాజులు తగులుతూ ఉండడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడుతుందని, నాడులపై స్వల్ప ఉద్దీపన కలుగుతుందని చెబుతారు. గాజుల చప్పుళ్లు మానసికంగా ప్రశాంతతను కలిగిస్తాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే వీటి ప్రభావంపై శాస్త్రీయ పరిశోధనలు పరిమితంగా ఉన్నప్పటికీ, సంప్రదాయ విశ్వాసాలు మాత్రం ఇప్పటికీ కొనసాగుతున్నాయి. సామాజికంగా కూడా గాజులు ఒక గుర్తింపుగా నిలుస్తున్నాయి. వివాహిత, అవివాహిత మహిళలను గాజుల ద్వారా గుర్తించే ఆచారాలు కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ ఉన్నాయి. పండుగల సందర్భంగా మహిళలు రంగురంగుల గాజులు ధరించడం ద్వారా ఆనందాన్ని వ్యక్తం చేస్తారు. ప్రత్యేకంగా సంక్రాంతి, దీపావళి, బతుకమ్మ వంటి పండుగల్లో గాజులకు మరింత ప్రాధాన్యం ఉంటుంది. ఆధునిక ఫ్యాషన్ ప్రపంచంలో కూడా గాజులు తమ స్థానం కోల్పోలేదు. సంప్రదాయ దుస్తులతో పాటు ఆధునిక దుస్తులతో కూడా సరిపడేలా డిజైన్లు మారుతున్నాయి. యువతలో మిక్స్ అండ్ మ్యాచ్ స్టైల్‌లో గాజులు ధరించడం ట్రెండ్‌గా మారింది. ఫ్యాషన్ డిజైనర్లు కూడా గాజులను తమ కలెక్షన్లలో ముఖ్య భాగంగా చేర్చుతున్నారు. ఇప్పటి పరిస్థితుల్లో గాజులు కేవలం అలంకరణ సాధనం మాత్రమే కాకుండా, ఒక సాంస్కృతిక గుర్తింపుగా, భావోద్వేగానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. సంప్రదాయాన్ని కాపాడుతూ, ఆధునికతను ఆహ్వానిస్తూ గాజులు మహిళల జీవితంలో ఒక ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా గాజుల ప్రాముఖ్యత మరింత పెరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పళ్ల బ్రష్ ఉపయోగం – నోటి ఆరోగ్యానికి మొదటి అడుగు

నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పళ్ల బ్రష్ చేయడం అత్యంత ముఖ్యమైన అలవాటు. రోజుకు కనీసం రెండు సార్లు పళ్లను శుభ్రం చేయాలని దంతవైద్యులు సూచిస్తున్నారు. ఇది పళ్లపై పేరుకునే మలినాలను తొలగించి దంత క్షయం, దంత వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. సరైన బ్రష్ ఎంపిక కూడా చాలా ముఖ్యమే. మృదువైన రోమాలు ఉన్న బ్రష్ ఉపయోగించడం మంచిది. గట్టిగా ఉండే బ్రష్ పళ్ల గుమ్మడిని దెబ్బతీసే ప్రమాదం ఉంది. అలాగే మూడు నెలలకు ఒకసారి బ్రష్ మార్చుకోవడం అవసరం. పళ్ల మధ్యలో ఇరుక్కుపోయే ఆహారాన్ని తొలగించడానికి సరైన విధంగా బ్రష్ చేయడం నేర్చుకోవాలి. పళ్ల ఆరోగ్యం కేవలం బ్రష్ చేయడంపైనే ఆధారపడదు. తినే ఆహారం కూడా ప్రభావం చూపుతుంది. ఎక్కువగా చక్కెర ఉన్న పదార్థాలు తీసుకోవడం వల్ల పళ్లకు నష్టం కలుగుతుంది. కాబట్టి అలాంటి ఆహారాలను తగ్గించడం మంచిది. అలాగే భోజనం చేసిన తర్వాత నోరు కడగడం కూడా మంచి అలవాటు. ఈ రోజుల్లో పిల్లల నుంచి పెద్దల వరకు పళ్ల సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో, సరైన బ్రషింగ్ అలవాట్లు చాలా అవసరం. చిన్నప్పటి నుంచే పిల్లలకు పళ్లను శుభ్రంగా ఉంచుకోవడం గురించి నేర్పించడం ద్వారా భవిష్యత్తులో సమస్యలను తగ్గించవచ్చు. నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మొత్తం ఆరోగ్యానికి కూడా చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ‘పెద్ది’లో స్పెషల్ సాంగ్ క్లియర్.. రామ్ చరణ్‌తో సంయుక్త స్టెప్పులు!

రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామా ‘పెద్ది’పై మరో ఆసక్తికర అప్డేట్ బయటకొచ్చింది. ఈ సినిమాలో హైలైట్ కాబోయే స్పెషల్ సాంగ్ విషయంలో నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడినట్లు సమాచారం. ఈ స్పెషల్ సాంగ్ కోసం మొదట మృణాల్ ఠాకూర్, మానసా వారణాసి పేర్లు వినిపించినప్పటికీ, చివరకు సంయుక్త మీనన్ను ఫైనల్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఇటీవల ‘అఖండ 2: తాండవం’లో “జాజికాయ జాజికాయ” పాటతో మాస్ స్టెప్పులు వేసి ఆకట్టుకున్న సంయుక్త, ఇప్పుడు అదే ఎనర్జీతో రామ్ చరణ్‌తో కలిసి స్క్రీన్‌పై సందడి చేయనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలతో ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు ఈ స్పెషల్ సాంగ్ మరింత ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. ఇక రామ్ చరణ్ ఎనర్జీ, సంయుక్త స్క్రీన్ ప్రెజెన్స్ కలిస్తే ఈ పాట సినిమా హైలైట్ అయ్యే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, ‘ఉప్పెన’ తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ప్రాజెక్ట్ కావడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థల సమర్పణలో రూపొందుతున్న ఈ సినిమాకు సంగీతాన్ని ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారు. మొత్తంగా ‘పెద్ది’లో ఈ స్పెషల్ సాంగ్ ప్రేక్షకులకు ఫుల్ మాస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వబోతుందనే టాక్ బలంగా వినిపిస్తోంది.





## ఓటీటీలో ‘యూత్’ దూకుడు.. రిషబ్ శెట్టి ప్రశంసలు వైరల్

కోలీవుడ్‌లో చిన్న సినిమాగా విడుదలై భారీ విజయాన్ని అందుకున్న ‘యూత్’ ఇప్పుడు ఓటీటీలోనూ సత్తా చాటుతోంది. యంగ్ టాలెంట్ కెన్ కరుణాస్ స్వయంగా నటించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రం తాజాగా మంచి స్పందనను అందుకుంటోంది.

ఈ సినిమాను చూసిన కన్నడ స్టార్ రిషబ్ శెట్టి తన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ప్రశంసలు కురిపించారు. “చాలా కాలం తర్వాత ఒక సినిమా చూస్తూ ఇంత హాయిగా నవ్వుకున్నాను. ఇందులోని ప్రేమ, స్నేహం, ఎమోషన్స్ చాలా బాగా ఆకట్టుకున్నాయి” అని పేర్కొన్నారు.

అలాగే రచన, దర్శకత్వం, నటన—— మూడు విభాగాలను ఒంటిచేత్తో నడిపించిన కెన్ కరుణాస్ ఈ సినిమాకు ప్రధాన బలం అని కొనియాడారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం, ఫ్రెండ్స్ గ్యాంగ్ వినోదం సినిమాకు మరింత బలం చేకూర్చాయని తెలిపారు. రిషబ్ శెట్టి వంటి స్టార్ నటుడు ప్రశంసించడంతో ఈ సినిమాకు మరింత క్రేజ్ పెరిగింది. ప్రస్తుతం ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. యూత్ మాత్రమే కాకుండా ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా ఆకట్టుకోవడం విశేషం.

కథ విషయానికి వస్తే.. మధ్యతరగతి కుటుంబానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడి జీవితం చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది. ఐఏఎస్ అవ్వాలని తల్లి ఆశపడుతుంటే, అతను మాత్రం కాలేజీ జీవితంలో ప్రేమలో మునిగిపోతాడు. ముగ్గురు అమ్మాయిల మధ్య ప్రేమ గందరగోళం, కుటుంబ సమస్యలు——ఈ నేపథ్యంలో సాగిన కథ ప్రేక్షకులను అలరిస్తోంది.

## మెగా158లో గ్యాంగ్‌స్టర్ టచ్.. చిరు – అనిల్ కపూర్ కాంబో హైలైట్?

చిరంజీవి, బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మెగా 158 ప్రాజెక్ట్ టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ‘వాల్తేరు వీరయ్య’ వంటి భారీ విజయానికి తర్వాత ఈ కాంబో మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి.



తాజాగా ఈ సినిమా గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఈ చిత్రానికి ‘కాకాజీ’ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు టాక్ నడుస్తోంది.

ఇక ఈ ప్రాజెక్ట్‌లో అత్యంత ఆసక్తికర అంశం ఏమిటంటే.. బాలీవుడ్ వెటరన్ స్టార్ అనిల్ కపూర్ కీలక పాత్రలో నటించే అవకాశమున్నట్లు సమాచారం. ఒకే ఫ్రేమ్‌లో చిరంజీవి, అనిల్ కపూర్ కనిపించబోతుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు హై వోల్టేజ్ యాక్షన్‌తో పాటు సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ సినిమాలో చిరంజీవి సరికొత్త గ్యాంగ్‌స్టర్ లుక్‌లో, తనదైన డైలాగ్ డెలివరీతో ప్రేక్షకులను ఆకట్టుకోనున్నారని సమాచారం. దర్శకుడు బాబీ సిద్ధం చేసిన స్క్రిప్ట్‌పై మెగాస్టార్ పూర్తి నమ్మకం వ్యక్తం చేయడంతోనే ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని టాక్.

మెగా మాస్ ఎలిమెంట్స్, యాక్షన్, గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్ కలిసిన ఈ సినిమా టాలీవుడ్‌లో కొత్త రికార్డులు సృష్టించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనలు వెలువడనున్నాయి.

## ‘గాయపడ్డ సింహం’ మే 1న రిలీజ్.. తరుణ్ భాస్కర్ సీరియస్ ప్లాన్ షాక్!

టాలెంటెడ్ డైరెక్టర్, నటుడు తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో నటించిన ‘గాయపడ్డ సింహం’ సినిమా విడుదలకు సిద్ధమైంది. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మే 1, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయడంతో ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘అమెరికన్ డ్రీమ్’ చుట్టూ తిరిగే ఒక యువకుడి జీవిత ప్రయాణం ఈ సినిమా కథాంశం. క్రైమ్ కామెడీ డ్రామాగా రూపొందిన ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటిస్తుండగా, హర్షవర్ధన్, విష్ణు ఓయ్, సుభలేఖ సుధాకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. “నవ్వకండి.. ఇది చాలా సీరియస్ మేటర్”



అనే ట్యాగ్‌లైన్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇక సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తరుణ్ భాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటివరకు ఎక్కువగా కామెడీ చిత్రాలే చేసిన తాను, ఇకపై తన శైలిని మార్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో కమిట్ అయిన ప్రాజెక్టులను పూర్తి చేసి, ఆ తర్వాత కామెడీ జానర్‌కు విరామం ఇవ్వాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఇక నుంచి సందీప్ రెడ్డి వంగా, ఆదిత్య ధర్ తరహాలో బలమైన ఎమోషన్స్ ఉన్న సీరియస్ డ్రామా చిత్రాలను తెరకెక్కించడమే తన లక్ష్యమని తరుణ్ భాస్కర్ పేర్కొన్నారు. దీంతో ఆయన కెరీర్‌లో కొత్త దిశ మొదలుకాబోతుందనే చర్చ ఇండస్ట్రీలో సాగుతోంది.

## పూరీకి విజయ్ సేతుపతి స్పెషల్ మెసేజ్!


పవర్‌ఫుల్ మాస్ డైలాగ్స్‌తో పాటు మెసేజ్‌ను అందిస్తూ ప్రేక్షకులను అలరించే దర్శకుల్లో పూరీ జగన్నాథ్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. పవన్ కళ్యాణ్, రవితేజ, మహేశ్ బాబు, నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోల కెరీర్‌లకు కొత్త దిశ చూపించిన డైరెక్టర్‌గా ఆయన గుర్తింపు పొందారు. సినిమాల్లో తనదైన శైలిలో రాసిన మాస్ డైలాగ్స్‌తో క్లాస్, మాస్ ప్రేక్షకుల్ని ఒకేసారి ఆకట్టుకోవడం పూరీ ప్రత్యేకత. “ఎప్పుడొచ్చామన్నది కాదన్నయ్యా.. బుల్లెట్ దిగిందా లేదా?” వంటి డైలాగ్స్ ఇప్పటికీ అభిమానుల నోట వినిపిస్తుంటాయి. ఇలాంటి సక్సెస్‌ఫుల్ ప్రయాణంతో సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 26 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆయనతో కలిసి పనిచేస్తున్న విజయ్ సేతుపతి ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. “సినిమాతో 26 ఏళ్ల ప్రయాణం కేవలం



మైలురాయి కాదు.. అది ధైర్యం, నమ్మకం, నిర్భయమైన స్వరంతో నిర్మించబడిన ఒక వారసత్వం. మీతో ‘స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్’లో పని చేయడం ఎంతో ఆనందంగా ఉంది. మేము నటులుగా మా సౌకర్యవంతమైన జోన్ దాటి కొత్తగా చూపించే దర్శకుల కోసం ఎదురు చూస్తుంటాం. మీరు ఆ పని అద్భుతంగా చేస్తున్నారు” అంటూ ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా షూటింగ్ అనుభవం అందరికీ ప్రత్యేకంగా మిగిలిపోతుందని పేర్కొంటూ, ప్రభావవంతమైన కథలతో పూరీ విజయపథం కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## హారర్ కామెడీతో.. ‘ఓం శాంతి డిస్కో శాంతి’

తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయం అవసరం లేని దర్శకుడు మహి వి రాఘవ్ మరోసారి వినూత్న కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ‘యాత్ర’, ‘ఆనందో బ్రహ్మ’, ‘సేవ్ ది టైగర్స్’ వంటి ప్రాజెక్ట్‌లతో మంచి గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు హారర్ కామెడీ జానర్‌లో ‘ఓం శాంతి డిస్కో శాంతి’ సినిమాను తెరకెక్కిస్తున్నారు. “ఇప్పటికే జాగ్రత్త కియా.. ఆల్రెడీ..” అనే క్యాప్షన్‌తో వచ్చిన ఈ సినిమా మోషన్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటివరకు దెయ్యాలు మనుషులను భయపెట్టడం చూశాం.. కానీ ఈ సినిమాలో దెయ్యాలకే భయం పుట్టించే పాత్రలు ఉంటాయని మేకర్స్ హింట్ ఇచ్చారు. దెయ్యాలు వర్సెస్ పిచ్చివాళ్లు అనే కాన్సెప్ట్‌తో ఈ




సినిమా ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది. ఈ చిత్రాన్ని త్రీ ఆటమ్ లీవ్స్ షోరన్నర్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లేను కూడా మహి వి రాఘవ్ అందిస్తున్నారు. సంగీతాన్ని కృష్ణకుమార్ అందిస్తుండగా, రోహిణి, ముక్కు అవినాష్, షకలక శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. దెయ్యాలు పిచ్చివాళ్లను భయపెడతాయా..? లేక పిచ్చివాళ్లే తిరగబడి దెయ్యాల్ని భయపెడతారా..? అనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా సాగనుందని సమాచారం.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in